సమస్యలు పరిష్కరించండి

● కలెక్టర్ రంజిత్ బాషా



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని అధికారులను ఆదేశించారు. కర్నూలు అర్బన్ తహసీల్దార్ లాగిన్‌లో 21 రోజుల నుంచి రెండు అర్జీలు, కల్లూరు తహసీల్దార్ లాగిన్‌లో 3 అర్జీలు, సర్వశిక్ష అభియాన్, పీవో వద్ద 19 రోజుల నుంచి ఒక అర్జీ, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వద్ద వారం రోజుల నుంచి ఒక అర్జీ, ఉద్యానవన శాఖ వద్ద ఒకటి, పంచాయతీరాజ్ ఎస్ఈ వద్ద ఒక అర్జీ చొప్పున పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 10, పత్తికొండ ఆర్డీవో వద్ద 6, కర్నూలు ఆర్డీవో వద్ద 5, సర్వే ఏడీ వద్ద 2, కార్మిక శాఖ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ వద్ద ఒక్కో దరఖాస్తు చొప్పున పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, అనూరాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వలస బాటన పశ్చిమం



తోళ్ల ఉరుకుందు

కోసిగి 9వ వార్డు కాలనీ నుంచి తెలంగాణకు వలస వెళ్తున్న కూలీలు

● కోసిగి నుంచి 30 కుటుంబాలు

ఇప్పుడిప్పుడే ఖరీఫ్ మొదలైంది. వానలు నమ్మకం కలిగించడం లేదు. పంటలు పండి పూట గడుస్తుందనే భరోసా కలగడం లేదు. సీజన్ మొదలు కాకముందే వ్యవసాయం నిరాశను మిగిల్చింది. ఊళ్లో బతకడం కష్టమని తెలిపోయింది. పశ్చిమ ప్రాంతం నుంచి ప్రజలు తెలంగాణకు వలస బాట పట్టారు.

కోసిగిలోని 9వ వార్డు గాంధీనగర్ కాలనీకి చెందిన సుమారు 30 కుటుంబాలు సోమవారం పిల్లాపాపలతో కలిసి మూటముల్లె సర్దుకుని తెలంగాణకు వ్యవసాయ పనులకు బయల్దేరారు. కోసిగి కరువుకు, వలసకు పుట్టినిల్లు. ఏటా వలస మీదే మండల ప్రజలు ప్రధానంగా బతుకుతున్నారు. ఎక్కడ కూలి పనులు ఉంటే అక్కడికి సంసారమంతా తరలిపోతుంది. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలోనే వలస తప్పలేదు. పక్క రాష్ట్రంలో కూలీ ఎక్కువగా ఇస్తుండటంతో వెళ్తున్నామని కూలీలు అన్నారు. ఏటా నవంబరు, డిసెంబరు మధ్యలో వలసలు ప్రారంభమయ్యేవి. ఈసారి అప్పుడే ఇండ్లకు తాళాలు పడ్డాయి. - కోసిగి (ఆంధ్రజ్యోతి)

అధిక కూలి వస్తుందని వలస వెళ్తున్నాం

ఇక్కడ పని చేసే కూలీకి రూ.200 నుంచి రూ.300 కూలి వస్తుంది. పక్క రాష్ట్రంలో రూ.500 నుంచి రూ.800 దాకా కూలి ఇస్తున్నారని తెలిసింది. అందుకే భార్యా పిల్లలను వెంట బెట్టుకుని పోతున్నా. - తోళ్ల ఉరుకుందు

అందరం ఒకే చోట పని చేస్తాం



మా కుటుంబం అందరం కలిసి ఒకే చోట పని చేస్తే డబ్బులు ఎక్కువగా వస్తాయి మూడు నెలలు కష్టపడితే రూ.లక్ష దాకా సంపాదించుకుంటాం.

- కె.అంజినమ్మ, 9వ వార్డు, కోసిగి

సామానులతో వలస వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కూలీలు





పిల్లాపాపలతో వాహనంలో వలసబాట పట్టిన కోసిగి కూలీలు

6వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

● జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు అగ్రికల్చర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం 6వేల ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటలను పెంచేందుకు రైతులకు ప్రయోజనాలు అందించనున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రామాంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో భాగంగా రైతుల పొలాల్లో వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వ్యవసాయ పంటలతో పోలిస్తే ఉద్యాన పంటలకు అధిక ఆదాయం సమకూరుతోందన్నారు. దీనిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 0.25 ఎకరాల నుంచి 5 ఎకరాల భూమి కలిగిన జాబ్ కార్డు కలిగిన రైతులు ఉద్యాన పంటలు పెంచుకునేందుకు ఉపాధి హామీ కింద నిధులు మంజూరు చేస్తోందని చెప్పారు. ఆయా రైతుల పొలాల్లో నాటే మొక్కల రకాలను బట్టి రేటు, వాటికి వేసే ఎరువులు, నిర్వహణ వ్యయం తదితర ఖర్చులను ఉపాధి హామీ పథకం కింద రైతులకు అందించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున పేదల రైతుల పొలాల్లో పండ్ల తోటల పెంపకానికి చేయూత ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు.

ఉర్దూ గురుకులానికి దరఖాస్తు చేసుకోండి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఏపీ ఉర్దూ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోని కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జే. సురేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ విభాగంలో 7, బైపీసీ విభాగంలో 7, సీఈసీ విభాగంలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల మైనార్టీ విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

● **సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల కళాశాలలో:** 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఉమ్మడి జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాసంస్థల కోఆర్డినేటర్ ఐ. శ్రీదేవి సోమవారం తెలిపారు. ఆసక్తిగల అర్హులైన అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం 9.30 గంటలకు చిన్నటేకూరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో హాజరు కావాలన్నారు.

విభేదాలకు చెక్ పెడతాం

● పార్టీ నాయకులను ఒక తాటిపైకి తెస్తాం
● ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు

ఆలూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆలూరు నియోజకవర్గంలో నెలకొన్న వర్గ విభేదాలకు చెక్ పెడతామని ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. సోమవారం ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆలూరు మండల బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బస్తిపాటి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీలో విభేదాలకు అవకాశం ఇవ్వకుండా సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. పూల నాగరాజు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ, టీడీపీ మండల కన్వీనర్ అశోక్, జడ్పీటీసీ లింగప్ప, నాయకులు రామ్‌నాథ్‌యాదవ్, శేషగిరి, మండల బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.



ఆలూరులో బూత్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు

అంతటా సోలార్ వెలుగులు..!



● ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సదుపాయం ● ఎస్సీ, ఎస్టీలకు ఉచితం
● బ్యాంకర్ల ద్వారా రుణం కూడా.. ● ఇప్పటికే జిల్లాలో 645 దరఖాస్తులు
● ఈ నెల ఆఖరికి 2000 కనెక్షన్ల లక్ష్యం

నంద్యాల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఇప్పుడు ఎక్కడ చూసినా సోలార్ వినియోగం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు ఇతరులకు కూడా సబ్సిడీ రూపంలో ఇండ్లపై సోలార్ పలకలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన పథకం కింద సోలార్ కిలో వాట్ల ప్రకారం సబ్సిడీ అందించి ప్రజలకు సోలార్ యూనిట్లను మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లా విద్యుత్‌శాఖ పరిధిలోని మూడు డివిజన్‌ల పరిధిలో 645 మంది గృహాలపై సోలార్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నారని ఆ శాఖ వర్గాల నుంచి తెలిసింది. పైగా ఈ నెల ఆఖరికి జిల్లా వ్యాప్తంగా 2000 కనెక్షన్లు చేయాలని లక్ష్యం పెట్టుకున్నట్లు తెలిసింది. ఏది ఏమైనా భవిష్యత్‌లో సోలార్ వినియోగంతో జిల్లాలో సదరు వర్గాలకు విద్యుత్ భారం తగ్గడంతో పాటు ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు ఏపీఎస్పీడీసీఎల్ కొనుగోలు చేసి సదరు నగదును యజమానులకు జమ చేయనుంది. మొత్తంగా కూటమి నిర్ణయంతో సదరు వర్గాలకు ఆర్థికంగా కలిసి వచ్చే అంశంగా ఉండటంతో చాలా మంది యజమానులు ముందుకు వస్తున్నట్లైంది. ఆ దిశగా విద్యుత్‌శాఖ అధికారులు సైతం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఒక్కపైసా లేకుండా....

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పీఎం సూర్యఘర్ కింద వివిధ కిలో వాట్ల ప్రకారం సోలార్ యూనిట్‌లను ప్రజలకు అందిస్తున్నారు. విద్యుత్ రుణ భారం తగ్గించుకోవడంతో పాటు సదరు ఇంటి యజమానులకు ఆర్థికంగా కలిసి వచ్చే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి ఇలాంటి పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా.. తెల్ల రేషన్‌కార్డు కలిగిన ఎస్సీ, ఎస్టీలకు మాత్రం సోలార్ యూనిట్‌కు దరఖాస్తు చేసు కుంటే ప్రభుత్వమే ఒక్క పైసా లేకుండా వారి ఇళ్లపై ఏర్పాటు చేస్తుంది. అదేవిధంగా బీసీ, ఓసీ తదితర వర్గాలకు మాత్రం సబ్సిడీ రూపంలో సదుపాయం కల్పించింది. 1 కిలో వాట్‌కు రూ. 30 వేలు, రెండు కిలోవాట్లకు రూ. 60 వేలు, మూడు కిలో వాట్లకు రూ. 78 వేలు చొప్పున ఇలా.. సబ్సిడీ అవకాశం కల్పించింది. ఇదిలా ఉండగా.. ఒక్క పైసా పెట్టుబడి లేకుండా సదరు యూనిట్‌కు అయ్యే ఖర్చు అంతా కూడా బ్యాంకర్ల ద్వారా రుణ సదుపాయం కల్పించారు. ఎవరైనా ఆర్థికంగా ఉంటే సొంతంగానైనా వెచ్చించుకుని సబ్సిడీ పొంది ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఏపీఎస్పీ డీసీఎల్‌కు అందించి ఆర్థికంగా ఆదాయం వెంటనే పొందవచ్చు.



జిల్లా విద్యుత్‌శాఖ కార్యాలయం

25 ఏళ్ల వరకు విద్యుత్ ఉత్పత్తి..

ఎవరైనా తమ ఇళ్లపై సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే..25 ఏళ్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఎవరైనా బ్యాంకు లోను పెట్టుకుంటే.. ప్రతి నెల చెల్లించే విద్యుత్ బిల్లును బ్యాంకు రుణం కింద ప్రతి నెల చెల్లించవచ్చు. నాలుగు లేదా..ఐదేళ్లలో రుణం పూర్తవుతుంది

మిగతా 4వ పేజీలో


ఎందుకీ అప్‌గ్రేడ్ ?

● ఉపాధ్యాయులు లేరు.. అదనపు గదులు నిర్మించలేదు
● 400 మంది విద్యార్థులకు ముగ్గురే టీచర్లు

4

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): లెక్చరర్ల పోస్టుల భర్తీ కోసం మంగళవారం నుంచి 23వ తేదీ వరకు జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో వెంకట నారాయణమ్మ అధికారులను ఆదేశించారు. సోమవారం డీఆర్వో కార్యాలయంలో ఏపీపీఎస్సీ పరీక్షలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఆరు పరీక్ష కేంద్రాల్లో ఏపీపీఎస్సీ పరీక్షలు జరగనున్నాయని తెలిపారు.



సంధ్యావేళ..

కర్నూలు జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం ప్రకృతి కనువిందు చేసింది. శివారులోని తుంగభద్ర నది సంధ్యావేళ ప్రశాంతంగా ప్రవహిస్తూ నగర ప్రజలను ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటల సమయంలో సూర్యుడు అస్తమిస్తున్న దృశ్యం తుంగభద్ర నదిలో కనిపించింది. నగరంపై మబ్బులు కమ్మిన ఆకాశం ముదురు నీలివర్ణంలో అబ్బురపరిచింది. ఈ అందాలను ప్రజలు తమ సెల్‌ఫోన్లలో బంధించారు.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)





అంతటా సోలార్ వెలుగులు..!



5వ పేజీ తరువాయి

పైగా తమ ఇంటికి పోను మిగతా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను విద్యుత్ శాఖకు విక్రయించి తగిన నగదును సదరు ఇంటి యజమాని ప్రతి నెలా పొందవచ్చు. అదే విధంగా ఎవరైనా బ్యాంకులో లోను తీసుకోకుండా సొంతంగా సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకుంటే మొదటి నెల నుంచే తమ ఇంటి అవసరానికి పోను మిగిలిన విద్యుత్‌ను విద్యుతశాఖకు విక్ర యించి ఆదాయం పొందవచ్చు. ఇలా 25 ఏళ్ల వరకు ప్రతి నెల ఆదాయం వస్తుంది.

సోలార్ వినియోగం ఎంతో ఉపయోగకరం



ఇండ్లపై సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవడం ప్రతి ఒక్కరికి ఎంతో ఉపయోగకరం. ఆర్థిక ఇబ్బంది లేకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ, బ్యాంకు రుణ సదుపాయం కల్పించాయి. ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా ఉచితం. పెద్దపెద్ద ఇళ్లతో పాటు అపార్ట్‌మెంట్‌లు కూడా సోలార్ విద్యుత్‌ను వినియోగించుకోవచ్చు. ఈ పథకానికి వచ్చిన దరఖాస్తుల్లో నంద్యాల జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఆసక్తి కలిగిన యజమానులు స్థానికంగా ఉండే ఏఈలను సంప్రదించాలి. ఆన్‌లైన్‌లో www.pm.suryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల ఆఖరికి ఈ లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నాం.

- సుధాకర్ కుమార్, విద్యుత్‌శాఖ ఎస్ఈ, నంద్యాల

17న మెగా జాబ్ మేళా

కర్నూలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యువత కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకుని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో జూలై 17న ఆదోనిలో ఏర్పాటు చేయనున్న జాబ్‌మేళా కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 17న నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఆదోని సాయి డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. 11 ప్రైవేటు కంపెనీల్లో 450 ఖాళీలను భర్తీ చేస్తారని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 17న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉండి, 10వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తి చేసిన వారు naipunyam.ap.gov.in యూజర్ రిజిస్ట్రేషన్ లింక్‌లో వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న నివృత్తి చేసుకునేందుకు 9985496587, 9703993995 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

కోడిగుడ్డు రూ.7.50



కొలిమిగుండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోడి గుడ్డు ధరలు కొండెక్కాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. ఓవైపు మార్కెట్లో చికెన్, మటన్ ధరలు మండి పోతున్నాయి. చికెన్ రూ.200కు పైగా విక్రయిస్తుండగా, మటన్ ధర రూ.850 నుంచి రూ.1000 వరకూ పలుకుతోంది. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు కోడి గుడ్లతోనైనా సరిపెట్టుకుందామంటే వాటి ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయని అంటున్నారు. రిటైల్ మార్కెట్‌లో ఏకంగా రూ.7.50కు చేరుకోవడంతో వినియోగదారులు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవలి కాలంలో మార్కెట్‌లో కోడి గుడ్ల వినియోగం విపరీతంగా పెరిగింది. డిమాండ్ తగ్గ ఉత్పత్తి లేకే ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లాలో రోజుకు లక్షకు పైగా కోడిగుడ్ల వినియోగం జరుగుతున్నట్టు వ్యాపార వర్గాల అంచనా.

శ్రీశైలంలో మాజీ సీఈసీ రాజీవ్ కుమార్



స్వాగతం పలుకుతున్న అధికారులు

నంద్యాల కల్చరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ జ్యోతిర్లింగ పుణ్యక్షేత్రమైన శ్రీశైలాన్ని మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ అగర్వాల్ సోమవారం సందర్శించారు. వీరికి ఆలయ అర్చకులు, ఈవో శ్రీనివాసులు, పోలీసు అధికారులు స్వాగతం పలికారు.

ఎందుకీ అప్‌గ్రేడ్..?



కిల్చిన్ పేట పురపాలక ఉన్నత పాఠశాల

- ఉపాధ్యాయులు లేరు.. అదనపు గదులు నిర్మించలేదు
- 400 మంది విద్యార్థులకు ముగ్గురే టీచర్లు

ఆదోని అగ్రికల్చర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖలో సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల చాలా పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. చూడ్డానికి ఇది బాగుంది. కానీ అప్‌గ్రేడ్ వల్ల పాఠశాలలో ఏ మార్పులు రాలేదు. ఉపాధ్యాయులను నియమించలేదు. పాఠశాలల్లో గదుల కొరత తీరలేదు. ఆదోని పట్టణంలో ఉన్నత పాఠశాలలు ఎటు చూసినా కిలోమీటర్ల దూరం ఉన్నాయి. దగ్గర్లోనే ఉన్నత పాఠశాలలు ఏర్పడ్డాయని తమ పిల్లలను పాఠశాలల్లోకి చేర్చేందుకు తల్లిదండ్రులు సిద్ధమయ్యారు. కానీ కొత్తగా అప్‌గ్రేడ్ అయిన పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. ఇంతకూ ప్రభుత్వం పాఠశాలలను ఎందుకు అప్‌గ్రేడ్ చేసినట్లు? అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మధ్యలో ఆగిన గదుల నిర్మాణం

గత వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు కింద కొన్ని పాఠశాలలకు అదనపు గదులు ప్రకటించినా.. నిధులు విడుదల చేయలేదు. కిల్చిన్ పేట పాఠశాలలో మూడు గదులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రకాష్ నగర్ పాఠశాలలోనూ ఇదే పరిస్థితి. ఆగిన అదనపు గదుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కూడా నిధులు విడుదల చేయలేదు.

విద్యారంగ సంస్కరణల్లో భాగంగా పాఠశాలల అప్‌గ్రేడ్‌ను ప్రభుత్వం ఒక విధానంగా తీసుకొచ్చింది. అప్‌గ్రేడ్ అనే మాట చాలా మంచిదే. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ మాటకు భ్రమపడ్డారు. విద్యార్థులు చేరిక పెరిగింది. ఇంత మంది విద్యార్థులను ఎక్కడ కూర్చోబెట్టాలి? ఎలా బోధించాలి? అని ఉపాధ్యాయులు తల పట్టుకుంటున్నారు. ఆదోని పట్టణంలో నాలుగు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూతపడ్డాయి. పురపాలక ఉన్నత పాఠశాలలు కేవలం నాలుగే ఉండడంతో పట్టణంలోని విద్యార్థులంతా ఆ పాఠశాలలకే వెళ్లేవారు. ఇది గమనించిన విద్యాశాఖ ప్రాథమికోన్నత పాఠశాలలను నాలుగింటిని ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఈ పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లుగా సీనియార్టీ ప్రకారం గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పిస్తూ ఆ పాఠశాలలకు కేటాయించారు. కిల్చిన్‌పేట పురపాలక ఉన్నత పాఠశాల, కల్లుబావి ప్రకాష్ నగర్ పురపాలక ఉన్నత పాఠశాల, ఆస్మియా ఉర్దూ ఉన్నత పాఠశాల, ఆర్ఆర్ లేబర్ కాలనీ ఉన్నత పాఠశాల తోపాటు అండర్ పేట ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలకు గ్రేడ్-2 హెచ్ఎం లతోపాటు కొంతమంది ఎస్జీటీలకు పదోన్నతి కల్పించడంతో సబ్జెక్ట్ టీచరులు వచ్చారు. ప్రధానంగా కిల్చిన్‌పేట పురపాలక ఉన్నత పాఠశాలలో 6నుంచి9వ తరగతి వరకు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ కేవలం హెచ్‌ఎంతో పాటు ఇద్దరే టీచరులు ఉన్నారు. 16 మంది ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట హెచ్ఎం, బయాలజీ, ఇంగ్లీష్ బోధించే వారు మాత్రమే ఉన్నారు. ఇంగ్లీష్, సోషల్, హిందీ, ఫిజికల్ సైన్స్ టీచర్లు లేరు. ఇరుకు గదులలలో విద్యార్థులకు కిక్కిరిసి కూర్చుంటున్నారు. ఏడో తరగతిలో 118 విద్యార్థులు ఉన్నారు. తరగతి గది చాలక పోవడంతో బాలికలను ఒక గదిలో బాలురను మరో గదిలో కూర్చోపెట్టినా చాలక కొందరు కింద కూర్చుంటున్నారు. కల్లుబావి ప్రకాష్ నగర్‌లోని పురపాలక ఉన్నత పాఠశాల 460మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలలో అదే పరిస్థితి. హెచ్‌ఎంతో పాటు నలుగురు ఉపాధ్యాయులే ఉన్నారు. విద్యార్థుల నిష్పత్తికి 16మంది ఉపాధ్యాయులు అవసరం. ఆస్మియా ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో కూడా 182మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ హెచ్‌ఎంతో పాటు నలుగురే ఉపాధ్యాయులు.



విద్యార్థులతో కిక్కిరిసిన తరగతి గది

డీఎస్సీలోనైనా ఉపాధ్యాయులను నియమిస్తారా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెగా డీఎస్సీ ప్రకటించింది. అత్యధికంగా జిల్లాల్లో ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఇది కూడా పశ్చిమ ప్రాంతమైన ఆదోని నియోజకవర్గంలో ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



కిల్చిన్ పేట ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న గదుల నిర్మాణం

చేరికలు భారీగా పెరిగాయి



మా పాఠశాల చుట్టూ మూడు కిలోమీటర్లలో ఎక్కడ కూడా ప్రభుత్వ ఉన్నత పాఠశాల లేదు. దీంతో మా పాఠశాలలో అడ్మిషన్లు పెరిగాయి. తరగతి గదుల కొరత, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది.

- ఉరుకుందప్ప, ప్రధానోపాధ్యాయుడు, కిల్చిన్ పేట పురపాలక పాఠశాల, ఆదోని

త్వరలో సమస్య పరిష్కారం



చాలా పాఠశాలల్లో తరగతి గదుల కొరత ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు కేటాయించిన వెంటనే గదులు నిర్మిస్తాం. డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయిన వెంటనే ఆయా పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులు వస్తారు.

- వెంకట రమణారెడ్డి, డిప్యూటీ ఈవో ఆదోని

బాధితులకు న్యాయం చేస్తాం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 102 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఫ్యాకల్టీ, అటెండర్, వంట మనిషి, వాచ్‌మన్, స్వీపర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి వెల్దుర్తికి చెందిన ప్రశాంత్‌బాబు మోసం చేశారని కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన నాగమణి, నారాయణ, అక్బర్, రాజేష్, సుజాత, వెంకటేశ్, మద్దిలేటి తదితరులు ఫిర్యాదు చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష పైగా 20 మంది నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. కేఎస్ఎస్ ఫౌండేషన్ పేరుతో అపాయింట్‌మెంటు లెటర్స్ ఇచ్చి ఏడాది వరకు పని చేయించుకుని జీతం, డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాదులో ఉన్న తన అక్క అర్చన రాణి లక్ష్మీపురం రోడ్డులోని తమ ప్లాట్‌ను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తోందని కర్నూలు శ్రీరామ కాలనీకి చెందిన అనితారాణి ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు కుమారులు వెటర్నరీ డాక్టరుగా, ఏఈలుగా పని చేస్తున్నారని, తనను ఇంటి నుంచి తరిమేశారని కోడుమూరు మండలం మెరుగుదొడ్డి గ్రామానికి చెందిన హనుమంతు ఫిర్యాదు చేశారు. ఏకోరన్ గాలి మరల కంపెనీలో పని చేస్తున్న సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్ కొన్న భూమిని వదిలి పెట్టి తన భూమిలో తవ్వకాలు మొదలు పెట్టారని, అడిగితే తనను కొట్టడానికి వస్తున్నారని ఆస్పరి మండలం జోహరాపురం గ్రామానికి చెందిన పరమేష్ ఫిర్యాదు చేశారు. కర్నూలు బాలాజీనగర్‌లోని ఇంటి గేటు లోపల ఉన్న తన బైకును దొంగలించారని అన్వర్ ఫిర్యాదు చేశారు.

డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన హెచ్‌డీఎస్



ఫిర్యాదు చేస్తున్న రామాంజనేయులు

కర్నూలు హాస్పిటల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లో నర్సింగ్ సిబ్బంది డ్యూటీ రోస్టర్‌లో అవకతవకలు ఉన్నాయని హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యుడు బి.రామాంజనేయులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జీజీహెచ్‌లో ఓ నర్సింగ్ అధికారి యూనిఫాం వేసుకోకుండా విధులు నిర్వహిస్తుందని, ఇటీవల మంత్రి రివ్యూ సమీక్ష సమావేశానికి యూనిఫాం లేకుండా హాజరయ్యారన్నారు. ఏళ్ల తరబడి కొన్ని వార్డుల్లో పాతుకుపోయిన నాన్ స్పెషలిస్టు నర్సులను ఎందుకు మార్చడం లేదని, ఏళ్ల తరబడి సూపర్‌స్పెషాలిటీ కొన్ని విభాగాలు, ఆపరేషన్ థియేటర్‌లో కొందరి నర్సులను ఎందుకు మార్చడం లేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. 8 సంవత్సరాల నుంచి ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ పేరుతో కొందరి నర్సులకు నైట్ డ్యూటీలు వేయడం లేదని, కానీ మెడికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ తెచ్చుకున్న వారిని, క్యాన్సర్‌తో బాధపడుతున్న నర్సులకు నైట్ డ్యూటీలు ఎలా వేస్తారన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జూనియర్ హెడ్ నర్సులు ఉన్నారనీ, డీఎంఈ ఆదేశాల మేరకు సీనియర్ హెడ్ నర్సులను వేయాలని కోరారు.

ఐదు తరగతులకు ఒకే టీచర్

- చింతకుంట ప్రాథమిక పాఠశాలలో దుస్థితి
- 329 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు మాత్రమే



చింతకుంట ప్రభుత్వ పాఠశాలలో టీచర్ లేకపోవడంతో ఖాళీగా కూర్చున్న 5వ తరగతి విద్యార్థులు

కోసిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అక్షరాస్యతలో చిట్టచివరి నుంచి మూడో స్థానంలో కోసిగి మండలం ఉంది. మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 329 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే టీచర్లు బదిలీ కావడంతో గత నెల జూన్ 9వ తేదీన వి. గంగమ్మ ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. అయితే.. ఐదుగురు ఉపాధ్యాయులు ఉండాల్సిన చోట ఒక్క ప్రధానోపాధ్యాయురాలు మాత్రమే చదువు చెబుతున్నారు. ఆమె విద్యార్థులకు పాఠాలు చెప్పలేక, రికార్డు వర్క్స్ చూసుకోలేక సతమతమవుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ ఏడాది ఒకటో తరగతిలో 55 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. 2వ తరగతిలో 65 మంది, 3వ తరగతిలో 74 మంది 4వ తరగతిలో 69 మంది, 5వ తరగతిలో 66 మంది మొత్తం పాఠశాలలో 329 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయురాలు వి. గంగమ్మ ఒక్కరే మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ అటెండెన్స్, అడ్మిషన్లు చూసుకోవాల్సి వస్తుంది. ఇన్ని పనులుగాక ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు ఎలా చెప్పాలని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదు తరగతులను నిర్వహించడం కష్టం



మా పాఠశాలలో 329 మంది చదువుకుంటున్నారు. గత నెల 9న కొత్తగా బదిలీపై ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టాను. టీచర్లు ఎవరూ లేరు. ఐదు తరగతులను ఒక్కదాన్నే చూసుకోవడం కష్టంగా ఉంది.

- వి. గంగమ్మ, ప్రధానోపాధ్యాయురాలు, చింతకుంట పాఠశాల



ప్రధానోపాధ్యాయురాలు మాత్రమే ఉండటంతో పాఠశాల బయట ఆడుకుంటున్న విద్యార్థులు



3వ తరగతి క్లాస్ లీడర్లే రివిజన్ చేయిస్తున్న దృశ్యం

మాకు మేమే పాఠాలు చెప్పుకుంటున్నాం



మా పాఠశాలలో ఒక్కరే టీచర్. మేడం ఆఫీసు పని చూసుకుంటున్నారు. మాకు పాఠాలు చెప్పడానికి ఎవరూ లేరు. మా క్లాస్ లీడర్లే రివిజన్ తరగతులు చెబుతున్నారు.

- శ్రీదేవి, 5వ తరగతి విద్యార్థిని, చింతకుంట

పాఠాలు ఎవరూ చెప్పడం లేదు..



మేడం ఒక్కరే భోజనాలు, అటెండెన్స్ చూసుకుంటున్నారు. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేకపోవడంతో భోజనం తిని ఆడుకుని ఇంటికి వెళ్తున్నాం.

- అభిరాం, 4వ తరగతి విద్యార్థి, చింతకుంట

అపహరణ కేసు నమోదు

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణానికి చెందిన కామిరెడ్డి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అపహరణ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన చెప్పిన దాని ప్రకారం.. పెసరవాయి గ్రామానికి చెందిన కామిరెడ్డి రాధకు కర్నూలు పట్టణం వాసవీనగర్‌కు చెందిన మురళీమోహన్‌రెడ్డితో వివాహమైంది. పెసరవాయిలో మొహర్రం వేడుకలకు రాధ తన తల్లి పుణ్యవతితో కలిసి కర్నూలు నుంచి బస్సులో బయలు దేరింది. ఇంటికి వచ్చి చూసుకుంటే బ్యాగ్‌లోని క్యారియర్ బాక్సులో ఉంచిన 4 తులాల బంగారు కనిపించ లేదు. రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు..

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గడిగరేవుల గ్రామానికి చెందిన క్రిష్ణవేణికి, నంద్యాల పట్టణానికి చెందిన వెంకటశివభరత్‌కు ఏడాది క్రితం వివాహమైంది. కొన్నాళ్ల పాటు వారి సంసారం సజావుగా సాగింది. భర్త వెంకటశివ భరత్, అత్త సుబ్బలక్ష్మమ్మ, మామ గోపాల్, బావ రమణకుమార్ అదనపు కట్నం తీసుకొని రావాలని మానసికంగా, శారీరకంగా వేధించారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళపై దాడి..

కోవెలకుంట్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని బసిరెడ్డిబావి వీధిలో ఉన్న హసీనా అనే మహిళ ఇంటి ఎదురుగా ఉన్న కిశోర్, మల్లేశ్వరి, మల్లిక గొడవ పడ్డారు. ముగ్గురు కలిసి హసీనాపై దాడి చేయగా తలకు రక్తగాయాలయ్యాయి. కూతురు నసీమా కోవెలకుంట్ల పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

గడివేముల, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌కే తండా గ్రామానికి చెందిన నిర్మలాబాయి(23) వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఎల్‌కే తండాకు చెందిన శ్రీకాంత్‌నాయక్, నిర్మలాబాయి 4 ఏళ్లక్రితం ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కొన్ని రోజుల నుంచి భర్త శ్రీకాంత్‌నాయక్, అత్త బోడేబాయి, ఆడపడుచు శాంతిబాయి, మామ మంగేనాయక్ శారీరకంగా, మానసికంగా వేధిస్తుండటంతో సోమవారం నిర్మలాబాయి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి బుజ్జిబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

మిడుతూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని 49 బన్నూరు గ్రామానికి చెందిన షేక్ దర్వేష్ (14) అనే బాలుడు విద్యుదాఘాతానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. గత నెల 2వ తేదీన షేక్ రసూల్ సాబ్ పొలానికి వెళ్లాడంతో అతని కుమారుడు షేక్ దర్వేష్ కూడా వెళ్లాడు. అక్కడ తండ్రి కోసం వెతుకుతున్న క్రమంలో పొలంలో వున్న విద్యుత్ మోటారు వైర్లు తగిలి దర్వేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పొలంలో విద్యుదాఘాతానికి గురైన బాలుడ్ని కుటుంబసభ్యులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దర్వేష్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..

నంద్యాల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం నూనెపల్లె సమీపంలోని రైల్వేట్రాక్‌పై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వేహెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. చనిపోయిన వ్యక్తికి సుమారుగా 38 ఏళ్లు ఉండవచ్చునని, తెల్లచొక్కా ధరించాడని, తెలిసిన వాళ్లు రైల్వేస్టేషన్‌కు రావాలని కోరారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బెంగళూరులో కుంకనూరు వాసి..

దేవనకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కుంకనూరు గ్రామానికి చెందిన కురువ బచ్చాల రవికుమార్ (30) బెంగళూరు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామానికి చెందిన పెద్ద రంగన్న, సులోచనమ్మ దంపతుల పెద్ద కుమారుడు రవికుమార్ బెంగళూరులో ఎక్స్‌కవేటర్ నడుపుతూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం బావమరిది రవితేజతో కలసి బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో వెనుక వైపు నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. రవికుమార్‌కు భార్య రామాంజినమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.


రవికుమార్ (ఫైల్)

కుందూ నదిలో పడి మహిళ..

ఉయ్యాలవాడ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ సమీపంలోని కుందూనదిలో పడి దాసరి వెంకటలక్ష్మమ్మ(47) మృతి చెందారు. ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. సంజామల మండలంలోని కమలకూరు గ్రామానికి చెందిన వెంకటలక్ష్మమ్మ కుమారుడు వెంకటేశ్వర్లుతో కలిసి ఉయ్యాలవాడ గ్రామానికి బైకుపై బయలుదేరారు. ఆదివారం రాత్రి 10.30లకు రూపనగుడి సమీపంలో కుందూ బ్రిడ్జిపై వెళ్తుండగా బైకు అదుపుతప్పి నదిలోకి పడింది. దీంతో తల్లి, కుమారుడు నదిలో పడ్డారు. కుమారుడు ఈత రావడంతో తల్లిని గడ్డకు చేర్చే ప్రయత్నం చేశారు. అంతలో అక్కడున్న కొందరు వ్యక్తులు గమనించి తల్లిని గడ్డకు చేర్చారు హుటాహుటిన ఆమెను 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటలక్ష్మమ్మ కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దపాడు సమీపంలో దారి దోపిడీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ప్రధాన నిందితుడు రమేష్ (వాసవి నగర్, కర్నూలు), మరో ఇద్దరు బాల నేరగాళ్లు ఉన్నారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిన నూర్ బాషా అనే వ్యక్తి ఈ నెల 5వ తేదీన తెల్లవారుజామున హైదరాబాదు నుంచి కర్నూలు వచ్చారు. తెర్నేకల్లు వెళ్లాలని బళ్లారి చౌరస్తా వద్ద నిల్చుని ఉన్నారు. ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చి ఎక్కడికి వెళ్లాలని అడిగారు. మెయిన్ రోడ్డులో ఉండే కడివేముల వద్ద దిగుతానని నూర్‌బాషా చెప్పారు. తాము కూడా బళ్లారి వెళ్తున్నామని, రూ.100కు టికెట్ మాట్లాడుకుని నూర్‌బాషాను కారులో ఎక్కించుకున్నారు. పెద్దపాడు దాటిన తర్వాత ఆయనను కొట్టి సెల్‌ఫోన్, ఏటీఎం, క్రెడిట్‌కార్డు బలవంతంగా లాక్కున్నారు. ఫోన్ పే ద్వారా రూ.12వేల నగదును మరొకరి అకౌంటుకు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. రూ.6,500 నగదు లాక్కొని నెరవాడ సమీపంలో కారు నుంచి బయటకు తోసేసి వెళ్లిపోయారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం కర్నూలులో ముగ్గురిని అరెస్టు చేసి చేసి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఏటీఎం, క్రెడిట్ కార్డు, దోపిడీ చేసిన రూ.12వేలు, కారు స్వాధీనం చేసుకున్నారు. మద్యానికి బానిసై దోపిడీకి పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కాల్వలు ఇలా... నీరు పారేదెలా...?

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో తాగు, సాగునీరు అందించే ప్రధాన కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. కాల్వల మరమ్మతులకు రెండునెలల సమయం ఉన్నప్పటికీ జలవనరులశాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనుపడుతోంది. కాల్వల్లో గుర్రపుడెక్క పేరుకుపోయి నీళ్లు ముందుకెళ్లడం లేదు. మహానంది రోడ్‌లోని అబాండతాండ సమీపంలో వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే పాలేరు వాగు పూర్తిగా మూసకపోయింది. నీళ్లు ముందుకు పారకుండా పొలాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికే కేసీ కెనాల్‌కు మూడు అడుగుల మేర నీరు విడుదల చేశారు.

నేటికి కాల్వ పూర్తిస్థాయిలో ప్రవహించే అవకాశముంది. నంద్యాల పట్టణానికి తాగునీటిని అందించే తూము వద్ద మట్టి కుంగిపోయి తూము షట్టర్లకు ప్రమాదం ఏర్పడే అవకాశమున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం.


అబాండతండా వద్ద కేసీ కాలువలో పేరుకుపోయిన గుర్రెపుడెక్క

కేసీకి 1,500 క్యూసెక్కుల నీరు విడుదల

సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కెనాల్‌కు 1, 500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు ఈఈ ప్రతాప్ తెలిపారు. గోరుకల్లు నుంచి ఎస్సార్బీసీకి సోమవారం నీరు విడుదల చేశామన్నారు. నేడు వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి తెలుగుగంగకు విడుదల చేస్తామన్నారు.


నంద్యాల పట్టణానికి తాగునీటిని వదిలే తూము దుస్థితి

కాంట్రాక్టు పద్ధతిలో వైద్య పోస్టులు వద్దు

- బోధనాసుపత్రి వైద్యులకు తీవ్ర నష్టం
- కర్నూలు జీజీహెచ్‌లో ప్రభుత్వ వైద్యుల సంఘం నిరసన


నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ప్రభుత్వ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయరాదంటూ ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపింది. సోమవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీ ఎదుట ఏపీజీడీఏ (కర్నూలు మెడికల్ కాలేజ్ బ్రాంచ్) వైద్యులు కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల పోస్టుల భర్తీని తక్షణమే నిలుపుదల చేయాలని ఏపీజీడీఏ అధ్యక్షుడు డాక్టర్ పి.బ్రహ్మాజి మాస్టర్, కోశాధికారి శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు రామశివనాయక్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో వైద్యుల పోస్టులను తాత్కాలికంగా నిలుపుదల చేసి ముందుగా వైద్యులందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలోని బోధనాసు పత్రుల్లో 40 మంది ప్రొఫెసర్లు, 35 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తక్షణమే ప్రభుత్వం నోటిఫికేషన్‌ను రద్దు చేసి వైద్యులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ శారద, ప్లాస్టిక్ సర్జరీ వైద్యురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎరువులు, విత్తనాల షాపుల్లో రాష్ట్రస్థాయి తనిఖీ బృందం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. రాష్ట్రస్థాయి తనిఖీ బృందం కమలాపురం వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, అనంతపురం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు బృందం ఎరువులు, పురుగుల మందుల షాపులతో పాటు గోదాములను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఎరువుల నిల్వల స్టాక్ రిజిస్టర్లను, అనుమతి పత్రాలను పరిశీలించారు. న్యూవసువాహిని ఆగ్రో ఏజన్సీస్‌లో రూ.84వేల విలువైన ఎరువులు, శివసంతోష్‌రెడ్డి ఏజన్సీస్‌లో రూ.70వేల విలువైన ఎరువులకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటి అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. తనిఖీ అధికారులు నరసింహారెడ్డి, నాగభూషణం మాట్లాడుతూ దుకాణాలు, గోదాముల్లోని స్టాక్ వివరాలు ప్రతిరోజు మండల వ్యవసాయాధికారులకు తెలియజేయాలన్నారు. ఎరువులు, పురుగులమందులు, విత్తనాలను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించవద్దని, ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాకు కేటాయించిన ఎరువులను జిల్లాలోనే విక్రయించాలన్నారు. విత్తన శుద్ధి కేంద్రాల యజమానులు ఫౌండేషన్ రిజిస్టర్, మొలకశాతం రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలని, ప్రాసెసింగ్ చేసే సమయంలో విత్తనాలు కల్తీ జరగకుండా జాగ్రత్తగా ప్రాసెసింగ్ చేయాలని ఆదేశించారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పొదుపు రుణాల్లో గోల్‌మాల్..!

- రూ.36 లక్షలు కాజేసిన మహిళ

ఆత్మకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పొదుపు సంఘాలకు జారీ చేసిన రుణాల్లో గోల్‌మాల్ చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని కిషన్‌సింగ్‌వీధిలో గతంలో పొదుపు సంఘాలకు జారీ చేసిన రుణాల్లో అవకతవకలు జరిగాయని ఓ బ్యాంకు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నాలుగు స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ)లకు రుణాలను మంజూరు చేయించేందుకు ఓ ఎస్‌హెచ్‌జీ గ్రూపు లీడర్ ముందుకొచ్చింది. ఆ క్రమంలోనే నాలుగు సంఘాలకు చెందిన కొందరి రుణాలను ఓ మహిళ స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పొదుపు సంఘాల ప్రక్షాళన నేపథ్యంలో సభ్యుల చేర్పు, తొలగించేందుకు సంబంధించి పరిశీలన చేయగా కొందరి సభ్యుల పేర్లపై నేటికీ అప్పులు ఉన్నట్లు తెలిసింది. అయితే వారు తాము ఎలాంటి రుణాలను తీసుకోలేదని, ఓ గ్రూపు లీడర్ తమను మోసం చేసి సుమారు రూ.36 లక్షలు స్వాహా చేసినట్లు బాధితులు అధికారుల ఎదుట వాపోయినట్లు తెలిసింది. ఈ విషయంపై మెప్మా సీవో వెంకటేశ్వర్లును వివరణ కోరగా బాధితులెవరూ ఫిర్యాదు చేయలేదని అన్నారు.

తాగునీటి కోసం సర్పంచ్ ఇల్లు ముట్టడి


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మద్దికెర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని బెస్తవీధి కాలనీవాసులు సోమవారం సర్పంచ్ బండారు సుహాసిని ఇంటిని ముట్టడించారు. ఖాళీ బిందెలతో రోడ్డుపై సోమవారం సాయంత్రం నిరసన తెలిపారు. మూడు నెలల క్రితం పంచాయతీ వారు ఉచిత కొళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పడంతో కొళాయిలు వేసుకున్నామన్నారు. కార్యదర్శి శివకుమార్ కొళాయిలకు పైపులైన్ ద్వారా నీరందిస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలి

- ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్
- పోలీసులు, విద్యార్థి నాయకుల మధ్య తోపులాట


కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా విద్యార్థి నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ ప్రకారం ఉద్యోగాలకు నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి అయినా అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం కర్నూలు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఏఐవైఎఫ్ కార్యకర్తలు, నిరుద్యోగులు వినూత్న రీతిలో అర్ధనగ్న ప్రదర్శనతో ఖాళీ ప్లేట్లతో నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో సంపాదన సృష్టించి 25 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నిబంధనలను తుంగలో తొక్కారన్నారు. నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు ఇస్తామని, అందుకు ప్రణాళిక కూడా సిద్ధ చేశామని బహిరంగంగా ప్రకటించి నిరుద్యోగ ఓట్లతో గద్దెనెక్కి కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను విస్మరిస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపార్టుమెంట్లలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించి అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో 26 జిల్లాల్లోని యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్ గేటు ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా.. పోలీసులు కంచెను ఏర్పాటు చేసి ఆందోళనకారులను అడ్డుకున్నారు. పోలీసులకు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, పెద్దయ్య, రంజిత్‌గౌడు, జాఫర్‌పటేల్, నాగరాజు, నాయకులు నిరుద్యోగులు పాల్గొన్నారు.

బైకు దొంగల అరెస్టు


నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐ శేషయ్య సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిందితులు షేక్ బాబ ఫక్రుద్దీన్ (అన్నమయ్య జిల్లా), షేక్ దాదాపీరా (అన్నమయ్య జిల్లా), హనీఫ్ (కడప)లను అరెస్టు చేశామన్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... గూడూరుకు చెందిన చంద్రకుమార్ మే 22వ తేదీన కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. పార్కింగ్‌లో ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 23 మోటారు సైకిళ్లను, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కర్నూలు, నంద్యాల, గుంతకల్లు, హైదరాబాదు, నార్పల, అనంతపురం జిల్లాలో పలు బైక్ చోరీలకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. సుబాన్, షాపీర్ అనే నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్పీ కార్యాలయానికి 130 ఫిర్యాదులు

నంద్యాల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 130 ఫిర్యాదులు వచ్చినట్లు అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో నిర్ణీత సమయంలో విచారణ జరిపి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువగా కుటుంబ తగాదాలు, అత్తారింటి వేధింపులపై ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.

ఆలయానికి పటిష్ట భద్రత కల్పిస్తాం: ఎమ్మెల్యే


శివుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయానికి పటిష్ట భద్రత కల్పిస్తామని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆల యాన్ని ఆమె సందర్శించారు. ఆమెకు ఈవో మద్దిలేటి, ఆలయ అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మ స్వాగతం పలికారు. అనంతరం శివునికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల దోపిడీకి గురైన హుండీల దోపిడీపై ఈవో మద్దిలేటిని ఆలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆలయానికి పటిష్ట భద్రతతో పాటు నైట్‌వాచ్‌మన్, స్టాఫ్ కొరత ఉందని, ఈ విషయాన్ని దేవదాయ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆలయంలో ఎలాంటి రాజకీయాలు లేవని, అంద రూ ఆహ్వానితులే అన్నారు. ఆలయానికి ప్రహరీతోపాటు వివిధ పనుల నిమిత్తం టీటీడీ దేవస్థానం నిధులు మంజూరు చేసిందని, పనులు కూడా ప్రారంభించామన్నారు. హుండీలు చోరీ చేసిన దుండగులను సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించామని, త్వరలో అరెస్టు చేయాలని ఆమె పోలీసులను ఆదేశించారు.

ఆలయాల్లో రాజకీయాలు సరికాదు

మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి


హుండీ చోరీ గురించి ఈవోను అడిగి తెలుసుకుంటున్న కాటసాని

ఓర్వకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో రాజకీయాలు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల ఆలయంలో 5 హుండీలు చోరీ గురించి ఆయన సోమవారం ఆలయాన్ని సందర్శించారు. హుండీ చోరీకి గురైన వివరాలు ఈవో మద్దిలేటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను అధికారంలో ఉన్న సమయంలో ఆలయాల్లో ఎలాంటి రాజకీయాలు చేయలేదని, ఆలయానికి ఎవరు వచ్చినా ఆహ్వానించామన్నారు. ఆలయ చరిత్రలో ఏనాడూ హుండీలు చోరీకి గురికాలేదని, ఈ విషయంపై పోలీసులు దుండుగలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంగన్న, రంగనాథ గౌడు, నారాజు, రమణారెడ్డి, చెన్నారెడ్డి, నాగతిరుపాలు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న చంద్రబాబు

కల్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తున్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. సోమవారం 32వ వార్డు ముజఫర్‌నగర్‌లో ఆయన బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ కూటమి ప్రభుత్వ మోసాలను గుర్తించాలని క్యూఆర్‌కోడ్‌తో స్కాన్ చేయించారు. కొందరు ప్రజలు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో రాలేదని, కొత్త పింఛన్లు అందడం లేదని, తల్లికివందనం నగదు జమ కాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్లు సానా శ్రీనివాసులు, ఇప్పల నారాయణరెడ్డి, భీమేశ్వరరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండలంలో ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్‌ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకుడు మునిస్వామి కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవనకొండ మండలంలో వ్యవ సాయ మార్కెట్ లేకపోవడంతో ఆదోని, ఎమ్మిగనూరు, తాడేపల్లిగూడెం కర్నూలు ప్రాంతాలకు రైతులు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. రైతుల ప్రయోజనాల కోసం వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా దొమ్మరజాతి, బంగాల, మొండి, బుడ బుక్కల జాతుల వారికి ఇంటి నివాసం స్థలం లేక అనేక సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి పేదలకు ఇంటి పట్టా మంజూరు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు ఏడీఈ నాగేంద్రప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్టాంటన్‌పురం, బాలాజీనగర్, మమతనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరంగా జరిగేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ రంజిత్ బాషా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం శానిటేషన్, సీజనల్ వ్యాధులు, టేక్ హోం రేషన్ అంశాలపై నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్లు, మండల స్పెషల్ ఆఫీ సర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఈవోఆర్‌డీలు, సీడీపీవోలతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిప్పగిరి మండలంలోని ఏరూరు గ్రామంలో, కోడుమూరు మండలంలోని కోడుమూరు-3, ప్యాలకుర్తి గ్రామాల్లో, హొళగుంద మండలంలోని హెబ్బటంలో, కోసిగి మండలంలోని చిర్తనకల్‌లో, ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెలో, పెద్దకడుబూరు మండలం నౌలేకల్‌లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని ఐవీఆర్‌ఎస్‌ద్వారా నెగిటివ్ ఫీడ్ బ్యాక్ వచ్చిందని, ఎందుకు పారిశుధ్య పనులు చర్యలు చేపట్టడం లేదని ఎంపీడీవో, ఈవోఆర్‌డీలను ప్రశ్నించారు. జిల్లాలో బాలసంజీవని, టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీని పోషణ్ ట్రాకర్, బాల సంజీవని యాప్‌లో అప్‌లోడు చేయాలని సీడీపీవోలను ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఐసీడీఎస్ పీడీ నిర్మల పాల్గొన్నారు.

అధికారులతో కమిషనర్ సమీక్ష

కర్నూలు న్యూసిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో ఎస్‌ఈతోపాటు డీఈఈ, ఏఈఈలతో సమీక్షించారు. మంత్రి టీజీ భరత్‌తో త్వరలో ఓ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం జరుగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనులు ఎంత వరకు పూర్తి అయ్యాయి అనే దానిపై కమిషనర్ ఆరా తీశారు.

పండ్లతోటల సాగుతో అధిక లాభాలు

సి.బెళగల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చునని కోడుమూరు ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. సోమవారం మండలంలోని మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో రైతులు సాగుచేసిన దానిమ్మ, నిమ్మకాయ, ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. ఆయన వెంట హార్టికల్చర్ అసిస్టెంట్లు, రైతులు ఉన్నారు.

ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లపై విచారణ చేపట్టాలి

కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నాయకుల వినతి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత లేని వారు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పొందుతున్నారని వాటిపై విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ రంజిత్ బాషాకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్ శరత్, డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మహేంద్రనాయుడు, ఆర్ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహేష్‌లు మాట్లాడారు. ప్రభుత్వం డీఎస్సీ 2025 పరీక్షలను నిర్వహించిందని, అందులో చాలా మంది అభ్యర్థులు అర్హత లేని వారు కూడా ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు పొంది డీఎస్సీ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కానీ ఎటువంటి తనిఖీలు చేయకుండా రెవెన్యూ అధికారులు కొందరు అభ్యర్థులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో విజయ్, అనిల్, గోపాల్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

● గోకారి కాలనీ, పడిదెంపాడు గ్రామవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి బి.వెంకటస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ కలెక్టర్‌ను కోరారు.

● జిల్లాలో ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు ఎరుకుల రాజు కోరారు. జిల్లాలో భూ సమస్యలతో అనేక మంది షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలతో ఇబ్బంది పడుతున్నార న్నారు.

● గూడూరు రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రభుత్వ హౌస్ సైట్‌లో సర్వే.నెంబరు.859 నమోదైందని గూడూరు పట్టణానికి చెందిన రేవుల గోవిందు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గోవిందు మాట్లాడుతూ సర్వే నెంబరు.859లో గత నాలుగు తరాల నుంచి అక్కడే నివసిస్తున్నామన్నారు. మా ఇంటి స్థలం పక్కన ప్రభుత్వ హౌస్ సైట్ వేశారు. ఇందులో సర్వే.నెం.859లో గూడూరు రెవెన్యూ అధికారులు నమోదు చేశారు. కాబట్టి ప్రభుత్వ హౌస్ సైట్, డాట్ ట్యాండ్‌ను రికార్డు నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరారు.

● దేవనకొండ ఎంఈవోపై విద్యార్థి సంఘం నాయకులు మహేంద్ర, శరత్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవనకొండ మండలంలోని ఎం.కొట్టాల వద్ద ఉన్న ప్రైవేటు పాఠశాల ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు. ఈ పాఠశాలపై ఎంఈవోకు ఫిర్యాదు చేసినా కూడా ఎంఈవో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

● కోడుమూరు పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 3 నెలల పెండింగ్ జీతం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, కోడుమూరు ఏఐటీయూసీ మండల కార్యదర్శి రాముడు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలల జీతం రాకపోవడంతో స్వచ్ఛభారత్ కింద పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలి: కమిషనర్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన అర్జీలకు ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ నగర శివారు కాలనీల్లో రోడ్లు, పారిశుధ్యం, కాలువలు, పార్కుల ఏర్పాటుపై వస్తున్న దరఖాస్తులను ప్రాధాన్యం క్రమంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీల ప్రసాద్ పాల్గొన్నారు.

● స్వచ్ఛాంధ్ర క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలు ఇప్పించాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయరామాం జనేయులు కమిషనర్ పి.విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రైవర్లకు ఐదు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఓర్వకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

విజిలెన్స్ దాడులు

గోదాముల్లో ఎరువులు, విత్తనాల ప్యాకెట్ల తనిఖీ


గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, జూలై 14(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని పురుగు మందులు, ఎరువులు, విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అధికారి నారాయణప్ప, వ్యవసాయ శాఖ అధికారి ఏడీఏ రమేష్ సోమవారం దాడులు చేశారు. అదేవిధంగా కల్లూరు మండల ఏవో డి.విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ అగ్రి జెనిటిక్స్ కంపెనీ గోదాములో పత్తి విత్తనాల ప్రాసెసింగ్ యూనిట్‌పై దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. పరమేశ్వర ఏజెన్సీస్ ఫర్టిలైజర్స్ షాపులో 46,400లు విలువ చేసే మైక్రో న్యూట్రియన్స్ నిలుపుదల చేశారు. శ్రీకృష్ణ ఏజెన్సీతో పాటు చైతన్య ఫర్టిలైజర్స్ దుకా ణాల్లో తనిఖీలు చేసి రికార్డులను పరిశీలించారు.

ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్


ఈవ్ టీజర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

కర్నూలు క్రైం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నాగరాజరావు, ఎస్ఐలు సతీష్ కుమార్, మల్లికార్జునలు అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ తదితర ప్రాంతాలతోపాటు పలు కాలేజీల వద్ద సోమవారం సాయంత్రం మారువేషాల్లో తనిఖీలు చేశారు. ఆయా కాలేజీల వద్ద సుమారు 20 మంది యువకులు విద్యార్థులపై అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించి, వారిని స్టేషన్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

క్షయ నివారణపై అవగాహన పెంచుకోండి



మాట్లాడుతున్న ఎంపీ నాగరాజు

కర్నూలు రూరల్, జూలై 14(ఆంధ్రజ్యోతి): క్షయ (టీబీ) వ్యాధిపై పెంచుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రజలకు సూచించారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో సోమవారం జరిగిన జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమానికి ఎంపీ నాగరాజు హాజరై ప్రసంగించారు. క్షయ వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకొంటున్నాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, జిల్లా క్షయ అధికారి డాక్టర్ మల్లికార్జున, ఎంపీహెచ్‌సీవో మగ్బుల్ సాహెబ్, టీడీపీ నాయకులు కృష్ణ యాదవ్, రఫిక్ పాల్గొన్నారు.

అలజడులు సృష్టించేందుకే..

● పెర్ని నానీ.. నోరు అదుపులో పెట్టుకో
● డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్


మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు అర్బన్, జూలై 14(ఆంధ్రజ్యోతి): గుడివాడలో సభ పేరుతో కులాల మధ్య అలజడులు సృష్టించేందుకు వైసీపీ నాయకులు ప్రణాళికలు సిద్ధం చేశారని డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ ధ్వజమెత్తారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ధరూర్ జేమ్స్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్రం రామకృష్ణుడులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లపై వైసీపీ నాయకులు అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, పైగా పెట్టుబడులు రాష్ట్రానికి రావా లంటే భయ పడేలా చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వంపై బురద జల్లాలని వైసీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని, పెర్నినాని పామర్రు సభలో చీకట్లో కన్నుకొడితే నరికేయాలని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమని ప్రశ్నించారు. పెర్నినానీ నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. ఈసమావేశంలో నాయకులు మంచాలకట్ట భాస్కర్‌రెడ్డి, ఆదాం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నూతన కమిషనర్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ పి.రంజిత్ బాషాను నగర పాలక నూతన కమిషనర్ పి.విశ్వనాథ్ మర్యాదపూ ర్వకంగా కలిసారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వ కంగా కలిసి కలెక్టర్‌కు కమిషనర్ పుష్ప గుచ్ఛం అందజేశారు. అనంతరం నగరాభివృద్ధిపై కలెక్టర్‌తో చర్చించారు.

శ్మశాన వాటిక పరిశీలన

కర్నూలు న్యూసిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని 15వ వార్డులో ఉన్న శ్మశానవాటికను ఎస్‌జీకేఎస్ రాష్ట్ర నాయకుడు ఎన్.జి.కృష్ణ, కేవీపీఎస్ నాయకులు రెడ్డిపోగు రమణలు సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానవాటిక అడవిని తలపిస్తుం దని, మౌలిక వసతుల కోసం కేటాయించిన రూ.70 లక్షలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాటికాపరులు రంగా, రాజేశ్, శ్రీ ను, మధు, నరేష్, కేవీపీఎస్ నాయకులు మహేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు న్యూసిటీ, జూలై 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష డిమాండ్ చేశారు. సోమవారం బిర్లా కాంపౌండులోని సమితి కార్యాలయంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శ్రీహర్షను కలిసి సమస్యలను వివరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాటానికి తాము మద్దతు తెలుపుతామన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సమీర్‌బాషా, రంగ పాల్గొన్నారు.

కంది విత్తనాల పంపిణీ


కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో

గూడూరు, జులై 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని ఆర్ కానాపురం గ్రామానికి చెందిన రైతులకు కంది విత్తనాలను ఏవో దస్తగిరి రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఎంపీఈవో ఫరెహన భాను, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, మన్యంకొండ, కృష్ణ పాల్గొన్నారు.

బుగ్గ రామేశ్వరుడికి జలాభిషేకం


శివుడికి జలాభిషేకం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఓర్వకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో కర్నూలు మార్కెట్ కమిటీ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శివుడికి 1001 బిందెలతో సోమవారం జలాభిషేకం నిర్వహించారు. గత 26 ఏళ్లుగా శివయ్యకు అభిషేకాలు నిర్వహిస్తున్నామని అసోసియేషన్ సెక్రటరీ కట్ట చంద్రశేఖర్, ప్రెసిడెంటు శ్రీనివాసరెడ్డి తెలిపారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని జలాభిషేకం చేశామన్నారు.

కాల్వబుగ్గ హుండీ ఆదాయం రూ.2.96 లక్షలు

ఓర్వకల్లు, జూలై 14(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఇన్స్‌పెక్టర్ రమేష్, ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు ప్రారంభించారు. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 7 నెలల రెండు పెద్ద హుండీలు లెక్కించగా, రూ.2,80,743లు రాగా, అన్నదాన హుండీకి రూ.14,760లు వచ్చినట్లు ఈవో మద్దిలేటి తెలిపారు. మొత్తం ఆలయానికి రూ.2,96,503 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

లైన్‌మెన్ సమస్యలను పరిష్కరిస్తాం

ఓర్వకల్లు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ లైన్‌మెన్ సమస్యలను పరిష్కరిస్తామని డీఈఈ వై.సుబ్బన్న తెలిపారు. సోమవారం 'లైన్‌మెను లేరు'.. అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. స్పందించిన డీఈ ప్రస్తుతం అసిస్టెంట్ లైన్‌మెన్ నుంచి లైన్‌మెన్ క్యాడర్ ప్రమోషన్ కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందువల్ల కన్నమడకల, బ్రాహ్మణపల్లె, హుశేనాపురం, ఉప్పలపాడు, నన్నూరుకు లైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటం వాస్తవమేనన్నారు. ఆ కేసు తుది తీర్పు వెలువడిన వెంటనే ఆయా గ్రామాల్లో లైన్‌మన్ పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు: సీపీఎం

ఓర్వకల్లు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, దానిని విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు జీ.రామకృష్ణ కోరారు. సోమవారం సీపీఎం నాయకులు మధుసూదన్ ఆధ్వర్యంలో ఓర్వకల్లు విద్యుత్ ఆఫీసు ముందు ధర్నా చేశారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం సస్యశ్యామలం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం 36వ వార్డు పెద్దపాడులో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి ఆమె సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని, ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, కరపత్రాలను అందజేశారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చిందన్నారు. వైసీపీ విధ్వంస పాలనను తిరిగి గాడిలో పెట్టి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, క్లస్టర్ ఇన్‌చార్జి పీయూ మాదన్న, మాజీ సర్పంచు ఉమాదేవి, కో-క్లస్టర్ ఇన్‌చార్జి లోకేశ్వరరెడ్డి, పెద్దబీచుపల్లి, చిన్న బీచుపల్లి, కురువ ధనుంజయుడు, జవ్వాజీ గంగా ధర్‌గౌడ్, శేఖర్‌చౌదరి, దేవేంద్రారెడ్డి, వినోద్ పాల్గొన్నారు


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

ప్రజలు సంతృప్తితో ఉన్నారు: సోమిశెట్టి

కర్నూలు అర్బన్: చంద్రబాబు పాలనలో ప్రజలు సంతృప్తితో ఉన్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం నగరంలోని 14వ వార్డులో ఇన్‌చార్జి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కార్పొరేటర్ జక్రియా అన్సారి, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు అబ్బాస్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌లతో కలిసి సుపారిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అకెపోగు ప్రభాకర్, కార్పొరేషన్ల డైరెక్టర్లు కొంకతి లక్ష్మీనారాయణ, పోతురాజు రవికుమార్, ధరూర్ జేమ్స్, నంద్యాల నాగేంద్ర, సోమిశెట్టి నవీన్, నంది మధు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే

సి.బెళగల్: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం తిమ్మనదొడ్డి, చింతమానుపల్లె గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తకోట హరి, సింగిల్ విండో ప్రెసిడెంట్ తిమ్మప్ప, ఎంపీటీసీ ఈరన్నగౌడు, అమర్, రంగన్న, రవి, హనుమంతుగౌడు దస్తగిరి, సూరి, భీమన్న, విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న గౌరు చరిత, మల్లెల రాజశేఖర్


ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న సోమిశెట్టి, బీటీ నాయుడు

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన: ఎంపీ

కర్నూలు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన సాగిస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. కర్నూలు మండలం పంచలింగాల గ్రామంలో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఎంపీ హాజరయ్యారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ఎంపీ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కృష్ణయాదవ్, రఫిక్ పాల్గొన్నారు.

అండగా ఉంటాం

దేవనకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మేస్త్రీ జబ్బార్ (78) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.


పరామర్శిస్తున్న వీరభద్రగౌడ్

అధికార పార్టీ వారికి చట్టాలు వర్తించవా?



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

ఆదోని రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): దళిత సర్పంచ్‌ను అవమానించిన అధికారపార్టీ నాయకులపై ఎందుకు కేసు పెట్టలేదని దళిత సంఘాల నాయకులు మోపిరి సూర్య, రాముడు, శ్రీనివాస్, వెంకటేష్, శ్రీలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఢణాపురం సర్పంచ్ చంద్రశేఖర్‌తో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. గత నెల 16న ఢణాపురం సభలో ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ మహిళా నాయకురాలు గుడిసె సర్పంచ్‌ను స్టేజీపైకి ఆహ్వానించకుండా అవమానించారన్నారు.

కురువలకు ఎస్సీ సర్టిఫికెట్ దారుణం


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాదాసి, మాదారి, కురువలకు ఎస్సీ కులధ్రువీకరణ జారీ చేయడం దారుణమని మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరాం, డివిజన్ అధ్యక్షుడు బసాపురం ఎల్లప్ప ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీ ప్రభుత్వ జీవో ఎంఎస్ నెంబర్ 53ను రద్దు చేస్తూ గత మే 27న జీవో 10 విడుదల జారీ చేసిందన్నారు. తక్షణమే మాదాసి కురువలకు కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని కోరారు. నాయకులు వీరేష్ నాగరాజు, నరేష్ గిరి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


స్టాకు వివరాలను పరిశీలిస్తున్న అధికారులు

దేవనకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను ఏడీఏ సుదర్శన్ రాజు, విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. వెంకటసాయి ట్రేడర్స్, శ్రీ సత్యసాయి ఏజెన్సీ, కిసాన్‌మాల్‌లో విత్తనాలు, ఎరువులను, రికార్డులను పరిశీలించారు. తెర్నేకల్‌లో శ్రీమల్లికార్జున ఫర్టిలైజర్‌లో డీబీటీ యంత్రం పని చేయకపోవడంతో రూ.23.13 లక్షలు ఎరువుల, మందులకు విక్రయాలను నిలిపివేశారు. రికార్డులను పరిశీలిన అనంతరం అనుమతి ఇస్తామని పత్తికొండ ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్ తెలిపారు. ఏవో ఉషారాణి తదితరులు ఉన్నారు.

17న వైసీపీ సమావేశం



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

మద్దికెర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీపీపీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 17న 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వైసీపీ నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, మల్లికార్జున యాదవ్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారని, నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలని కోరారు. కృష్ణాయాదవ్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

ఆదోని, జూలై 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లను ఎత్తివేయాల ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో 'స్మార్ట్ మీటర్లు వద్దు, ట్రూ అప్ చార్జీలను రద్దు' చేయాలని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించారు. వినియోగదారులపై అదనపు భారం పడిందని, ఉపసంహరించుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలను సమీకరించి ఆందోళనకు సిద్ధమని హెచ్చరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నాయకులు మణి, అఖండ, మల్లికార్జున, వెంకప్ప, రాజు, మహాదేవమ్మ పాల్గొన్నారు.

ఎల్లెల్సీకి జలకళ


కాలువలో ప్రవహిస్తున్న నీరు

హాలహర్వి, జూలై 14 (ఆంధ్ర జ్యోతి): జిల్లా జీవనాడి తుంగభద్ర దిగువ కాలువ జలకళ సంతరించు కుంది. తుంగభద్ర జలాశయం నుంచి విడుదల చేసిన నీరు చింత కుంట నుంచి బాపురం మీదుగా హొళగుందకు చేరింది. బోర్డు డీఈ హుసేన్‌బాషా, ఏఈలు కిరణ్, దుర్గాప్రసాద్, శ్రీకాంత్ వేదపండితులు పూజలు చేశారు. ప్రస్తుతం జలాశయం నుంచి 500 క్యూసెక్కుల నీరు విడుదల చేశామని, రేపటి నుంచి గంటగంటకు పెంచు తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటర మణి తాగునీటి పథకాలకు మళ్లించారు.

పాలు బంద్


మద్దికెరలోని అంగన్‌వాడీ కేంద్రం

● 'అంగన్‌వాడీ'కి సరఫరా చేయని కాంట్రాక్టర్

మద్దికెర, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పదిరోజులుగా పాలు సరఫరా కావడం లేదు. దీంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. ప్రతి రోజూ కోడిగుడ్డు, పాలతో పాటు పౌష్టికాహారం అందిస్తామని చెబుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. మండలంలో 11 గ్రామాలు, 39 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి పిల్లలు, గర్భిణులు, బాలింతలు 3,500 దకా వస్తున్నారు. అయితే కాంట్రాక్టర్ పాలు సరఫరా చేయడం లేదని సమాచారం. విషయాన్ని ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై సీడీపీవో లలిత మాట్లాడుతూ పాలు సరఫరా అయిన వెంటనే అన్ని కేంద్రాలకు పంపిణీ చేస్తామన్నారు.



మండలంలోని గ్రామాల విద్యార్థులు బడికి వెళ్లాలంటే సర్కస్ చేయాల్సి వస్తోంది. సోమవారం ముద్దటమాగి గ్రామానికి చెందిన విద్యార్థులు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తూ కనిపించారు. తమ గ్రామం నుంచి దాదాపు 70 మంది విద్యార్థులు రోజూ ఐదు కిలోమీటర్లు వచ్చి చదువుకుంటున్నామని, బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. - హొళగుంద

సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారం



మారెళ్లలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం, పత్తికొండలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

తుగ్గలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు సమస్యలన్నీ పరిష్కారిస్తామని పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు పేర్కొన్నారు. సోమవారం మారెళ్ల గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. ఇంటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడంతో పాటు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు అని ఒక వైపు అభివృద్ధి కోసం కృషి చేస్తూ.. మరో వైపు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. తమ గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి నిర్మిస్తామన్నారు. బత్తిన వెంకట్రాముడు, ప్రభాకర్ రెడ్డి, వెంకటపతి, వెంకట్రాముడు గౌడు, డీవీఆర్ వెంకట్రా ముడు, రామయ్య, తిరుపాల్ నాయుడు ఉన్నారు. అనం తరం తల్లికి వందనం లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మాట నిలుపుకున్న చంద్రబాబు

పత్తికొండ: ఎన్నికల్లో ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. సోమవారం సాయంత్రం పత్తికొండ పట్టణంలోని కుమ్మరివీధి, పార్వతికొండ, బ్రాహ్మణవీధి ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. పార్వతికొండ ప్రాంతంలో సీసీ రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే త్వరలో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కొందరు తల్లికివందనం, పింఛన్ రాలేదని ఫిర్యాదు చేయగా, సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. సాంబశివారెడ్డి, బత్తినలోక్‌నాద్, కడవల సుదాకర్, గోవిందు, చక్కాగోపాలయ్య, బాలప్ప ఉన్నారు.

కష్టపడే కార్యకర్తలే నాయకులు


చిప్పగిరిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీ

చిప్పగిరి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలే నాయకులని ఎంపీ బస్తిపాటి నాగరాజు, పార్టీ పరిశీలకుడు పూల నాగరాజు, బీసీ జిల్లా సంఘం అధ్యక్షుడు ఏరూరు మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. సోమవారం చిప్పగిరిలో సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించి, ఇంటికి వెళ్లి పథకాలను వివరాంచారు. అనంతరం కన్వీనర్ షేక్షావలి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాన్ని నిర్మహించారు. ఎంపీ మాట్లాడుతూ సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. రజిని, బెల్డోన వెంకటేష్, చంద్ర, నరసింహులు, దానప్ప ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


ప్రచారం నిర్వహిస్తున్న వైకుంతం శివప్రసాద్, జ్యోతి

ఆలూరు, జూలై14(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంతం శివప్రసాద్, జ్యోతి అన్నారు. సోమవారం సాయంత్రం ఆలూరు మండలం ఎం.కొట్టాల, మొలగవల్లి గ్రామాల్లో 'సుపరిపాలన-తొలి అడుగు' నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల అమలును తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపు, తల్లికి వందనం అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజశేఖర్, కన్వీనర్ విజయ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఉచ్చీరప్ప, చిట్టిబాబు, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ఆదోని, జూలై14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులకు సమస్యలను తెలియజేస్తూ అర్జీదారులు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. డీఎల్‌డీవో బాలకృష్ణారెడ్డి, డీఎల్‌పీవో తిమ్మక్క, సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాస రాజు, ఆర్టీసీ డీఎం మహమ్మద్‌రఫీ, ఏడీ బాలవర్ధిరాజు, డీటీలు బాబు, రుద్రగౌడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, జూలై14(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని నారాయణగుంత వార్డులో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. డ్రెయినేజీ, విద్యుత్ స్తంభాల సమస్యలను తీర్చాలని కాలనీవాసులు ఫిర్యాదు చేయడంతో అధికారులకు ఫోన్‌చేసి పరిష్కరించాలని సూచించారు. ఉమాపతినాయుడు, రామకృష్ణ, బసాపురం రామస్వామినాయుడు, రంగన్న, మల్లికార్జున ఉన్నారు.

పెచ్చులూడుతున్న అంగన్‌వాడీ కేంద్రం


పెచ్చులూడిన కేంద్రం పైకప్పు

వెల్దుర్తి, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండలంలో పుల్లగుమ్మి అంగన్వాడీ కేంద్రం-1 భవనం పైకప్పు పెచ్చులూడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు పెచ్చులూడుతోంది. అదృష్టవశాత్తు ఆ సమయంలో పిల్లలు లేకపోవడంతో ప్రమాదమే తప్పింది. గోడలు పాతబడడి ఇమ్ము వస్తుండటంతో మిగతా రెండు గదుల్లోనే కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ 25 మంది ప్రీ ప్రైమరీ విద్యార్థులు, 20 మంది గర్భిణులు బాలింతలు, 3సం.లలోపు పిల్లలు 42 మంది ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు పురస్కారం


అవార్డు అందుకుంటున్న శ్రీనాథ్ గుప్తా

ఆదోని టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆవోపా ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్ గుప్తా ఉత్తమ సేవలు అందించినందుకు బెస్ట్ ప్రెసిడెంగ్ అవార్డు లభించింది. సోమవారం చిత్తూరు జిల్లా కాణిపాకంలో అఖిల భారత ఆర్యవైశ్య నిత్య అన్నపూర్ణ క్షేత్రంలో మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్, ఆవోపాకార్యదర్శి సుబ్బారావు నుంచి అందుకున్నారు.

విద్యార్థులందరికీ హాస్టల్ సీటు ఇవ్వాలి


వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని అగ్రికల్చర్ , జూలై 14 (ఆంధ్రజ్యోతి): వసతి కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులందరికీ బీసీ హాస్టల్‌లో సీటు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు శశిధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏబీసీడబ్ల్యూవో శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. సీట్లు ఖాళీ లేవని విద్యార్థులను చేర్చుకునేందుకు వార్డెన్ నిరాకరిస్తున్నారని గ్రామీణ విద్యార్థులు చదవువు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే హాస్టల్లో ప్రతి నెలా మెడికల్ క్యాంపులు నిర్వహించి వసతులు కల్పించాలని కోరారు. రాజు, మహేష్, హేమంత్ ఉన్నారు.

కల్తీ కల్లుతో ప్రాణాపాయం

ఆదోని టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కల్తీకల్లు కారణంగా ప్రాణాపాయం ఉందని మైనార్టీ పోరాట సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ అన్నారు. సోమవారం మాట్లాడుతూ పట్టణ పరిసరాల్లో తాటి చెట్లు లేకపోయినా కొందరు రసాయనాలతో తయారుచేసి విక్రయిస్తున్నారన్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఆదోనిలో రహదారులను విస్తరించాలి


లోకేశ్‌ను కలిసిన శ్రీకాంత్‌రెడ్డి

ఆదోని, జూలై 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రహదారులను విస్తరించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని టీడీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి కోరారు. సోమవారం మంత్రి లోకేశ్‌కు సమస్యలను వివరించారు. జలజీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని, ఆరేకల్లు వద్ద మెడికల్ కళాశాల పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని కోరామన్నారు.

'కస్తూర్బా'లో సీట్లు ఫుల్

తుగ్గలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సీట్లు ఫుల్ అయ్యాయనీ ఎస్‌వో షాహీన్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో సీట్లు ఖాళీ లేవని తల్లిదండ్రులు గమనించాలన్నారు.

పార్టీకి ఆపాదించవద్దు

తుగ్గలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కొందరు వ్యక్తిగతంగా గొడవ పడితే దాన్ని పార్టీకి ఆపాదించవద్దని టీడీపీ నాయకులు ఆదినారాయణ, మోహన్, శ్రీరాములు అన్నారు. సోమవారం మండలంలోని శభాష్‌పురంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు గొడవ పడితే దాన్ని టీడీపీ నాయకులు చేయించారనీ అబాండాలు వేయడం తగదన్నారు.

బీమా వినియోగించుకోండి

తుగ్గలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమాను రైతులు వినియోగించుకోవాలని ఏవో సురేష్ యాదవ్ సూచించారు. సోమవారం తుగ్గలిలో మాట్లాడుతూ నేటి నుంచి బీమా యాప్ ప్రారంభమవుతుందన్నారు. ఎకరా వరికి రూ.80లు, మొక్కజొన్నకు రూ.66లు, కందులకు రూ.44లు, ఎండుమిరప రూ.360లు, జొన్న రూ.38లు, ఆముదం రూ.36, కొర్ర, సజ్జ రూ.32, ఉల్లిగడ్డ రూ.90, పత్తి రూ.2వేలు, వేరుశనగ రూ.560లు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఈ నెల 31లోపు మీసేవా, సీఎస్‌సీ సెంటర్లలో సంప్రదించాలని సూచించారు.

రికార్డ్ అసిస్టెంట్ వీరంగం

హొళగుంద, జూలై 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల రికార్డ్ అసిస్టెంట్ కె శ్రీనివాసులు మద్యం తాగి కళాశాలకు హాజరవుతున్నాట్లు విద్యార్థుల తల్లిదండ్రులు గాదిలింగ, అశోక్ ఆరోపించారు. సోమవారం ప్రిన్సిపాల్ ప్రవీణకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రవేశం పొందిన ఆకాష్ అనే విద్యార్థి వివరాలు ఆన్‌లైన్ లో కనిపించకపోవడంతో రికార్డు అసిస్టెంట్‌ను సంప్రదించగా దుర్భాషలాడారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ ప్రవీణను వివరణ కోరగా పలుమార్లు హెచ్చరించానని, తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారని, ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం

ఆదోని అగ్రికల్చర్ , జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలకు ఎరువుల కొరత లేకుండా చూస్తామని ఏడీఏ బాలవర్ధిని రాజు, ఏవో సుధాకర్ అన్నారు. సోమవారం వ్యవసాయ కార్యాలయం వద్ద రైతులకు యూరియా కొరత లేకుండా ప్రైవేటు డీలర్లు లింకు అంటగట్టకుండా స్వయంగా వారే పర్మిట్లు రాసి రైతులకు అందజేశారు. తాము పర్మిట్లు రాసిన రైతులకు మాత్రమే ఎరువులు ఇవ్వాలని డీలర్లను సూచించారు. దీంతో వ్యవసాయ కార్యాలయం వద్ద మండలంలోని ఎరువులు అవసరమైన రైతులు పర్మిట్లు కోసం బారులు తీరారు.

రహదారులకు మరమ్మతులు చేయాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, జూలై14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారులకు మరమ్మతులు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కారు మంచి, పట్టణ కార్యదర్శి రామాంజనే యులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. ప్రధాన రోడ్లపై గుంతలు పడి వాహనదా రులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఆదోని రోడ్డు గోపాల్ ప్లాజా వద్ద గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గురుదాస్, కారన్న, కాసీం, ఎం.కె.సుంకన్న, ఖాన్ పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నివారించాలి


మాట్లాడుతున్న టాస్క్‌ఫోర్స్ టీం అధికారులు

దేవనకొండ, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలను నివారించాలని, వైద్యులు సకాలంలో స్పందించాలని టాస్క్ ఫోర్స్ వైద్యురాలు ఉమాదేవి, డీపీవో విజయ రాజు సూచించారు. సోమవారం పీహెచ్‌సీని స్థానిక తనిఖీ చేశారు. గర్భిణులు, బాలిం తలు, నవజాత శిశువుల విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలపై విచారణ చేశారు. అనంతరం నేలతలమర్రి సచివాలయానికి సంబంధించి వివరాలు తెలుసుకున్నారు. వైద్యాధికారులు విజయభాస్కర్, అరుణజ్యోతి, వైద్య సిబ్బంది ఉన్నారు.


ధ్రువపత్రాలు అందుకుంటున్న అధ్యక్షుడు

రైతు ఆర్థికాభివృద్ధే లక్ష్యం

తుగ్గలి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికాభివృద్ధి చెందడమే లక్ష్యమని మారెళ్ల సొసైటీ అధ్యక్షుడు ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం పెండేకల్ ఆర్ఎస్‌లో మారెళ్ల సొసైటీ అధ్యక్షుడిగా ప్రభాకర్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాసులు, మోహన్ బాధ్యతలు స్వీకరించారు. వీరికి సీఈవో మనోహర్ నాయుడు ధ్రుపత్రాలు అందించారు. సొసైటీలో ఎల్‌టీ లోన్లు మంజూరయ్యాయని, రైతులు వినియోగించుకోవాలన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తే నూతన రుణాలు అందుతాయన్నారు. టీడీపీ నాయకులు తిరుపాల్‌నాయుడు, మసాల శ్రీను, వెంకట్రాముడు, ప్రతాప్ యాదవ్, రామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు 635.. ఆరుగురు ఉపాధ్యాయులు


ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1 విద్యార్థులు

ఆలూరు, జూలై14(ఆంధ్రజ్యోతి): ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1లో మొత్తం 635 మంది విద్యార్థులు ఉండగా, ఇంగ్లీష్, మ్యాథ్స్, హిందీ, తెలుగు, ఆర్ట్, క్రాఫ్ట్‌కు మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. అంతమంది విద్యార్థులకు ఆరు మంది టీచర్లు బోధన సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యా యుల నియామకం అయ్యేవరకు ఇదే పరిస్థితి ఉంటుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

స్మార్ట్ మీటర్లు తొలగించకపోతే ఉద్యమం: సీపీఎం



ఎమ్మిగనూరు టౌన్‌లో విద్యుత్ ఏడీఎకు వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు



గోనెగండ్లలో..



కోసిగిలో..

ఎమ్మిగనూరు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ మీటర్లు తొలగించకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని సీపీఎం సీనియర్ నాయకులు రామాంజనేయులు, పట్టణ కార్యదర్శి గోవిందు పేర్కొన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. స్మార్ట్ మీటర్లు తొలగించకపోతే దశల వారిగా ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అబ్దుల్లా, కాలప్ప, రాముడు,



మంత్రాలయంలో ..

రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: ప్రభుత్వం గృహాలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేసే విధానాన్ని ఉపసహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట అరగంట పాటు సీపీఎం, సీఐటీయూ నాయకులు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇప్పటికైన ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని లేక పోతే 2000 లో జరిగి విద్యుత్ ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ ఏఈ సుధాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి కరుణాకర్, నబిరసూల్, రామకృష్ణ, ర సూల్, రంగస్వామి, మల్లికార్జున, సుభాన్, వలి, పాల్గొన్నారు.

కోసిగి: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేసి విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కోసిగి విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపైన భారం మోపడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాముడు, వీరేష్, నాగేంద్ర, గోపాల్, చిన్నన్న, తదితరులు ఉన్నారు.

మంత్రాలయం: రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, మండల కార్యదర్శి జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయం ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయం వద్ద స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రాణేష్, అంద్రయ్య, లక్ష్మన్న, సురేష్, ప్రసంగి, పాల్గొన్నారు.

కౌతాళం: రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజల విద్యుత్ వినియోగంపై ఆసరాగా చేసుకుని స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగించి ప్రజల నడ్డి విరుస్తున్నదని వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగించాలంటూ సోమవారం సీపీఎం పార్టీ నాయకులు మండల కేంద్రమైన కౌతాళం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్న చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు రామలింగ, చిన్న మారయ్య, హనుమంతు, వీరేష్ ఉన్నారు.



కౌతాళంలో..

ఫిజియోథెరపీపై అవగాహన

నందవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): నందవరం స్త్రీశక్తి భవనంలో సోమవారం రెవెన్యూ సిబ్బందికి ఫిజియోథెరపీ శిక్షణ కార్యక్రమం జరిగింది. అనంతరం రెవిన్యూ సిబ్బందికి ఫిజియోథెరపీ నిర్వహించారు. ఫిజియోథెరపీ ద్వారా మానసిక, శారీరక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ డాక్టర్లు మహేష్ కుమార్, వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్లు శివశేఖర్‌రావు, మహేష్ ఆర్ఐ రవీంద్రరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

మంత్రాలయం: ప్రతి రోజు ఉదయం వ్యాయామం, యోగాలో భాగంగా ఫిజియోథెరపీపై సమయాన్ని కేటాయించి జీవనప్రమాణాలు పెంపొందించుకోవాలని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఫిజియోథెరపిస్టులు మహేష్ కుమార్, వెంకటరమణ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందికి ఫిజియోథెరపీ వల్ల కలిగే లాభాలు, వాటి వల్ల జరిగే ఉపయోగాలు వివరించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి ఫిజియోథెరపీ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు జీకే గురురాజరావు, సరస్వతి, ఆర్ఐ జనార్దన్‌రావు, జయరామిరెడ్డి, మండల సర్వే యర్ అశోక్, నూర్ అహ్మద్, భీమన్నగౌడు, ఆనంద్, భీమయ్య, నరసప్ప, ప్రభాకర్, ఉరుకుందాచారి పాల్గొన్నారు.

'సమయపాలన పాటించడం లేదు'

కోసిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతకుంట గ్రామంలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వీరేష్ ఆరోపించారు. సోమవారం ఆయన సచివాలయం వద్దకు వచ్చారు. ఉదయం 11 గంటలైనా కార్యాలయానికి తాళం వేయడంతో వివిధ పనుల కోసం వచ్చిన లబ్ధి దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్టు దుకాణాలపై దాడులు

ఎమ్మిగనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మద్యం బెల్టు దుకాణాలపై సోమవారం పట్టణ ఎస్ఐ మధుసుధన్‌రెడ్డి, సిబ్బంది దాడి చేశారు. దాడుల్లో అనుమతి లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మల్లి, గోపాల్, వీరేస్, షంసుద్దీన్‌లను అరెస్టు చేసి 48 మద్యం క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు

గోనెగండ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా జిల్లా జిల్లా పరిషత్ ఛైర్మన్ హరిక, ఆమె భర్త రాముపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడటం అమానుషం అని నియోజకవర్గ వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మురళినాయుడు అన్నారు. రాష్ట్రంలో ఇటీవల మహిళలపై దాడులు పెరిగిపోయాయని ప్రజలు త్వరలోనే టీడీపీకి తగిన బుద్ధి చేప్పేరోజు దగ్గరలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు టౌన్: ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బీసీ మహిళా ఉప్పాల హరికపై జరిగిన దాడిని ఎమ్మిగనూరు వైసీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మురళీనాయుడు తీవ్రంగా ఖండించారు. దాడి జరిగే సమయంలో భద్రతా కల్పించాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం విస్మయానికి గురిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో మహిళలపై దాడులు జరగుతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా భయాందోళనలు నెలకొన్నాయి అన్నారు.

సమావేశాలను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరులో ఈ నెల 26,27వ తేదీల్లో జరిగే జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు రాము, కార్యదర్శి విజయ్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్లీనరీ సమావేశాలను విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కొరారు.

వంట ఏజెన్సీ తొలగింపు

మంత్రాలయం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న బోజనం చేసే ఏజెన్సీని తొలగించినట్లు ఎంఈఓ రాగన్న తెలిపారు. పాఠశాలలో స్థానిక శిల్పా పొదుపు గ్రూపు సభ్యులు వంట ఏజెన్సీ నిర్వహిస్తున్నారు. వారిపై ఆరోపణలు రావడంతో తాహశీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ నూర్జహాను, ఎంఈఓ రాగన్నలు విచారించి తొలగింపుకు ఆదేశాలు జారీ చేశారు.

డీఈఎఫ్ ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో జూలై 22వ తేదీన జరగబోయే దివ్యాంగుల సాధికారత ఫోరం ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. దివ్యాంగుల హక్కుల సాధనకు ప్రతి ఒక్కరు హజరై ఆవిర్భా వ సభను జయప్రదం చేయాలన్నారు. అనంతరం డీఈఎఫ్ ఆవిర్భావ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శివశంకర్, ఈరన్న, వెంకటేశ్, బాలకుళ్ళాయమ్మ పాల్గొన్నారు.

ఎంపీసీ సీట్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నందవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎంపీసీ గ్రూపులో చేరే విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు 16 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల వారు వెంటనే కళాశాలకు తమ ధృవీకరణ పత్రాలతో వచ్చి జాయిన్ అవ్వాల్సిందిగా కోరారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సీట్లు మొత్తం భర్తీ అయ్యాయన్నారు.

మంచి సేవలతోనే గుర్తింపు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులతో పాటు పాఠాలు బోధించిన వ్పుడే ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు వస్తుందని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి అన్నారు. సోమవారం విద్యాలయంలో పనిచేస్తున్న హిస్టరీ ఉపాధ్యాయులు బసవరాజ్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ముందుగా బసవరాజ్ దంపతులకు పూల మాలలు, శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, విద్యాలయం అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు భద్రత ఏర్పాట్లు

● బారికేడ్లు, షవర్లు ఏర్పాటు
● గజ ఈతగాళ్లు, పోలీసులతో బందోబస్తు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ, ఎంపీడీవో, సర్పంచులు



నదీతీరంలో పోలీసులు, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం బందోబస్తు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మంత్రాలయం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలకు వచ్చినపుడు ప్రమాదాలు జరగకుండా తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్, ఎస్ఐ శివాంజల్, మంత్రాలయం ఎగ్జిక్యూటీవ్ అధికారి ఉపేంద్రరెడ్డి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో నది తీరంలో భక్తులకు భద్రత ఏదీ..? అను శీర్షిక ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన శ్రీమఠం అధికారులు ఎస్‌కే శ్రీనివాసరావు, సురేష్ కోనాపూర్, డీఈ బద్రినాథ్ ఆదేశాల మేరకు నదీతీరంలో భక్తులు నదిలోకి వెళ్లకుండా నది ఒడ్డునే షవర్ల ద్వారా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా నదిలోకి వెళ్లకుండా బారీకేడ్లు, ఆరు మంది గజ ఈతగాల్లు, 8 పుట్టీలు, పోలీసు బందోబస్తు, శ్రీమఠం సెక్యూరిటీ, ఏపీఎస్‌డీఆర్ఎఫ్ 12 మంది బృందాలు బందోబస్తు నిర్వహిస్తున్నాయి. మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తూ భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక చిన్నపాటి రూములను ఏర్పాటు చేశారు. అదే విదంగా వాహనాల పార్కింగ్ కోసం పరిమళ పాఠశాల, హెలిప్యాడ్ గ్రౌండు, బస్టాండు ఎదురుగా ఉన్న స్థలంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఎగ్జిక్యూటీవ్ అధికారి ఉపేంద్రరెడ్డి, శ్రీమఠం పరిశుభ్రత విభాగం సిబ్బంది నదీతీరంలో పేరుకపోయినా చెత్తాచెదారం, బట్టలు శుభ్రం చేసి నదీతీరాన్ని ఆహ్లాదకరంగా మార్చారు. మంత్రాలయంలో భక్తులకు సరైన ఏర్పాట్లు చేయడంపై భక్తులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లి నారుకు తగ్గిన డిమాండ్

కోసిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు మాన్వి వెంకటరెడ్డికి చెందిన పొలంలో ఉల్లి నారుకు గిట్టుబాటు ధర లేకపోవడంతో సోమవారం గొర్రెలు, మేకలకు పశుగ్రాసంగా పంటను వదిలేశారు. సుమారు వంద కేజీల మేర ఉల్లి విత్తనాలు తన ఎకరా పొలంలో వేయగా.. నారుకు డిమాండ్ లేకపోవడంతో ఉల్లి పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఎవరూ ఉల్లి పంటపై మొగ్గు చూపకపోవడంతో రైతు మాన్వి వెంకటరెడ్డి తన పొలంలో ఉన్న ఉల్లి నారును పశువులు, మేకలుకు మేతకు వదిలాడు. సుమారు రైతుకు రూ.లక్ష మేర నష్టం వాటిల్లిందని తెలిపారు.



గిట్టుబాటు లేకపోవడంతో పశువుల మేతకు వదిలేసిన రైతు వెంకటరెడ్డి

టీడీపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణా రెడ్డి

మంత్రాలయం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన విశ్వకర్మ బ్రాహ్మణ సంఘం లోని 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. ఆదివారం మాధవరం గ్రామంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి నివాసంలో విశ్వకర్మ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు కమ్మరి ఉరుకుందు, కమ్మరి నరసింహులు, తిమ్మప్ప ఆచార్, కమ్మరి ఉరుకుందు, బారికి ఉరుకుందు కమ్మరి వెంకటేష్ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి టీడీపిలోకి చేరుతున్నట్లు వారు తెలిపారు. వీరికి టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, మంచాల సింగిల్ విండో అధ్యక్షులు రామకృష్ణారెడ్డిలు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువనాయకులు రాకేష్‌రెడ్డి, నారాయణ, మహేష్ ఆచార్, వీరేష్‌ఆచార్, నర్సప్ప, కుమార్, పాల్గోన్నారు.

ఉరుకుందలో ప్రత్యేక పూజలు

కౌతాళం, జూలై 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో సోమవారం భక్తులతో సందడిగా మారింది. సోమవారం స్వామి వారం కావడంతో దేవాలయం నందు అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ డిప్యూటీ కమీషనర్ విజయరాజు ఉచిత అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రజత గజవాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జూలై 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు రజత గజవాహనంలో బంగారు అంబారి పై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం అషాడ బహుళ చవితి శుభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు. పండితులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు.



బంగారు అంబారిపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

వైభవంగా హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

నందవరం, జూలై 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయచోటి గ్రామ పొలిమేరలో మారెమ్మ అవ్వ ఆలయ ముఖ ద్వార ప్రారంబోత్సవ పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. హంపీస్వామి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోత్సవాలతో హోమం నిర్వహించారు. చుట్టుపక్క గ్రామాల భక్తులు కూడా పూజల్లో పాల్గొన్నారు.

టీడీపీ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదు

కోసిగి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కోసిగి మండల పరిధిలోని దొడ్డి బెళగల్ గ్రామంలో టీడీపీ కార్యక్రమాలకు మండల టీడీపీ నాయకులు, గ్రామ టీడీపీ నాయకులు ఆ పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా అవమానం చేస్తున్నారని దొడ్డి బెళగల్ గ్రామ సర్పంచ్ మాలపద్మమ్మ భర్త మాల రామయ్య, ఐటీడీపీ మంత్రాలయం అధ్యక్షులు సోల్మాన్‌రాజు అన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సూర్యకాంత్‌రెడ్డి, తిక్కప్ప, వీర నాగప్ప, హంపయ్యపాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను పట్టించుకోండి

మంత్రాలయం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నది పరివాహక ప్రాంతంలో సర్వేనెంబర్.1లోని అక్రమ నిర్మాణాలు తొలగించాలని హైకోర్టు ఆదేశాలు పాటించాలని గనేకంటి రఘు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టులో పిటిషన్ ఉండగా.. నిర్మాణాలు చేపట్టడం కోర్టు ధిక్కరణకు వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలు తొలగించాలని కోరారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

పెద్దకడబూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మంత్రాలయం టీడీపి నియోజకవర్గ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిన్నకడబూరు గ్రామంలోని సుపరిపాలనలో తోలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న, సొసైటీ ఛైర్మన్‌లు మీసేవ ఆంజినేయులు, మీసేవా నరసప్ప, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలోనే గ్రామాల్లో అభివృద్ధి జరిగిందని గువ్వలదొడ్డి గ్రామ టీడీపీ ఇన్‌చార్జి భాస్కర్‌గౌడ్ అన్నారు. సోమవారం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షులు లక్ష్మన్నతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: టీడీపీ పాలనలోనే సుపరిపాలన సాధ్యం అని మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, హెచ్ కైరవాడి సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి అన్నారు. సోమవారం వారు చిన్నమరివీడు, అలువాల గ్రామాలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు హెచ్ కైరవాడి రాజేష్, అలువాల సర్పంచ్ బాషా, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రాలయం: కూటమి ప్రభుత్వంతోనే సంపద సృష్టిస్తూ, సంక్షేమపథకాలు ప్రజలకు అందజేస్తుందని టీడీపీ పట్టణ అధ్యక్షులు వరదరాజులు, సీనియర్ నాయకులు అశోక్‌రెడ్డి, ఎంపీటీసీ మేకల వెంకటేశ్ అన్నారు. సోమవారం మంత్రాలయంలోని రామచంద్రనగర్‌లో ఇంటింటికి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం భాగంగా ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు వివరిస్తూ సమస్యలను తెలుసుకుంటూ కరపత్రాలు పంపిణీ చేశారు.



అలువాలలో ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న కన్వీనర్ తిరుపతయ్యానాయుడు, నాయకులు

ఘనంగా మాచాని సోమనాథ్ జన్మదిన వేడుకలు



మాచాని సోమనాథ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ఎమ్మిగనూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాచాని సోమనాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు ఆయనను కలిసి పూలబొకేలు, పూలమాలలతో ఘనంగ సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. కార్యక్రమంలో నాయకులు మాచాని తారకేష్, కేవీసీ శివన్న, మల్లికార్జున, చంద్రన్న, వీజీఆర్ కొండయ్య, గడిగే లింగప్ప, దేవేంద్ర, లక్ష్మినారాయణ, వెంకటేష్ ప్రసన్న, ధన, అకౌంటెంట్ రాము, ఏఓ కృష్ణయ్యతో పాటు పలువురు హాజరయ్యారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గోనెగండ్ల, జూలై 14(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వర్షాలు కురిసే సీజన్ దీంతో అంటువ్యాధులు ప్రబలుతున్నాయని ప్రతి ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సంచార చికిత్స నోడల్ అధికారి రఘు కోరారు. సోమవారం మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక సిబ్బంది దీప, హేమలత, ఆశావర్కర్లు లక్ష్మిదేవి, ఖలీల్ పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 17న విజయవాడలో తలపెట్టిన మాదిగల విజయోత్సవ సభను జయప్రదం చేయాలని సంఘం డివిజన్ నాయకులు మంచోదు భీమన్న పిలుపు నిచ్చారు. పీఆర్ కార్యాలయం ఆవరణంలో చలో విజయవాడ కరపత్రాలను సంఘం నాయకులు విడుదల చేశారు.